క్లుప్తంగా

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి



అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి, నిర్లక్ష్యానికి తావివ్వరాదని, అర్జీలను అత్యంత నాణ్యతతో త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి భవన్‌లో జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఇందులో సుమారు 155 అర్జీలు రాగా, జేసీతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీరాణి, ఎస్‌డీసీ మధుసూదనరావు స్వీకరించారు. సీపీఓ వెంకటేశ్వర్లు, డీసీహెచ్ ఎస్.కార్తిక్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, జిల్లా వైద్య శాఖ అధికారి ఎం.దుర్గారావుదొర పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ నివేదికలు సమర్పించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: అసైన్డ్ భూములకు ఉచిత హక్కుల కల్పనపై తనిఖీ, రిజిస్ట్రేషన్ నివేదికలను సమర్పించాలని జేసీ టి.నిషాంతి ఆదేశించారు. సోమవారం అమరావతి నుంచి రాష్ట్ర భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జయలక్ష్మి 26 జిల్లాల జేసీతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల భద్రతపైన తహసీల్దార్లు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కలెక్టరేట్ భూ పరిపాలన విభాగం డిప్యూటీ తహసీల్దార్ చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదికకు 42 ఫిర్యాదులు



సమస్యల పరిష్కార వేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

అల్లవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ గ్రామాల నుంచి 42 ఫిర్యాదులు వచ్చాయి. ఎస్.రామేశ్వరం మొగ ప్రతి ఏటా మూసుకుపోయి వేలాది ఎకరాలు ముంపు బారిన పడుతున్నాయని, మొగని తవ్వడానికి రూ.లక్షలు వెచ్చించాల్సి వస్తుందని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, టీడీపీ నాయకులు వేగిరాజు వెంకటరాజు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ రైతులంతా ఏకమై ముందుకు వస్తే పంట్రభూముల్లో అనధికార చెరువులపై చర్యలు తీసుకుంటామన్నారు. జెడ్పీటీసీ కొనుకు గౌతమి, తహసీల్దార్ నరసింహారావు, ఎంపీడీఓ కృష్ణమోహన్, ఎస్సై హరీష్‌కుమార్ పాల్గొన్నారు.

అబ్బే ఉత్తుత్తి సరఫరా..

- అనధికార విద్యుత్ కోతలు
- లోఓల్టేజీతో నరకయాతన

అల్లవరం: ఫ్యాన్ తిరగదు... లైట్ వెలగదు.. ఫ్రిజ్ పనిచేయదు.. టీవీ రాదు.. అల్లవరం మండలంలో చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి. లోఓల్టేజీ సమస్యతో వచ్చిన తిప్పలివి. ఈ సమస్యతో గృహ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా అనధికార కరెంట్ కోతలతో ప్రజలు సతమతమవుతున్నారు. కరెంట్ ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉంది. వారం రోజులుగా ఎండలు ఎక్కువగా నమోదు కావడంతో విద్యుత్ వినియోగం బాగా పెరిగింది. పెరిగిన వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ అధికారులు కరెంట్ సప్లయ్ చేయడంలో విఫలమయ్యారు. దేవగుప్తం సబ్ స్టేషన్ పరిధిలో మూడు రోజులుగా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీనికి తోడు లోఓల్టేజీ సమస్యతో గృహాల్లో ఫ్యాన్లు తిరిగే పరిస్థితి లేదు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లు గ్రామాల్లో లేకపోవడంతో సాధారణ స్థాయి కంటే తక్కువగా సరఫరా అవుతుంది. అల్లవరం సబ్ స్టేషన్ పరిధి గోడితిప్పలో లోఓల్టేజీ సమస్య రెండు నెలలుగా ఉన్నా నేటికీ పరిష్కారం కాలేదు. గ్రామంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ప్రజల నుంచి డిమాండ్ ఉన్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదు. అల్లవరంలో లోఓల్టేజీ సమస్య, అనధికార కరెంట్ కోతలు అమలు అవుతున్నాయి. మొగళ్లమూరు పంచాయతీ పరిధి శిరగట్లపల్లిలో కొన్ని నెలలుగా లోఓల్టేజీ సమస్య ఉన్నా పట్టించుకునే వారు కరవయ్యారు. దీనిపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి గాలి వీచినా విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తూర్పులంకలో కూడా ఇదే సమస్య వేధిస్తోంది. బెండమూర్లంక సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో అనధికార విద్యుత్తు కోతలు, లోఓల్టేజీ సమస్యతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు.



దేవగుప్తంలో విద్యుత్ సబ్ స్టేషన్

సిగ్నల్స్‌కు అంతరాయం

అనధికార కరెంట్ కోతలతో మొబైల్ వినియోగదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కరెంట్ కట్ అయిన నిమిషాల వ్యవధిలో మొబైల్ సిగ్నల్స్ పడిపోతున్నాయి. దీంతో మొబైల్ వినియోగదారులకు నెట్ వినియోగంతో పాటు కాల్స్ వెళ్లని పరిస్థితి నెలకొంది. ఆయా నెట్‌వర్క్‌లకు సంబంధించి టవర్ల వద్ద విద్యుత్తు సరఫరాకు వచ్చిన అంతరాయంతో ఈ పరిస్థితి వస్తుందని తెలియవచ్చింది. ఈ సమస్యలపై ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్వరరావుని వివరణ కోరగా మండలం వ్యాప్తంగా లోఓల్టేజీ సమస్య ఉందని, డిమాండ్‌కు తగ్గ విద్యుత్తు సరఫరా కావడం లేదన్నారు. గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల కొరత ఉందని తెలిపారు.

అనధికార కోతలతో..



మూడు రోజులుగా అనధికార విద్యుత్ కోతలతో సతమతం అవుతున్నాం. విద్యుత్ సమస్యల పరిష్కారానికి సబ్ స్టేషన్‌కు ఫోన్ చేసినా ఎవరూ స్పందించడం లేదు. లోఓల్టేజీ సమస్యపై అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నేటికీ పరిష్కారం కావడం లేదు.

–చిట్టూరి గంగాధర్, దేవగుప్తం

పేకాట శిబిరంపై దాడి

అమలాపురం టౌన్: స్థానిక చిన్న వంతెనల సమీపంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న బృందంపై పట్టణ పోలీసులు ఆదివారం రాత్రి మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో రూ.9 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. దాడి సమయంలో కొంత మంది పేకాట రాయళ్లు పారిపోగా పట్టుపడ్డ వారిపై కేసు నమోదు చేశారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లకు శిక్షణ ఇస్తున్న ఏఓ సత్యనారాయణ

తాళ్లరేవు: గ్రామాల అభివృద్ధిలో అంతా భాగస్వాములు కావాలని ఎంపీపీ రాయుడు సునీత కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ హాలులో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీపీ సునీత ప్రారంభించారు. ఎంపీడీఓ కార్యాలయ ఏఓ కె.సత్యనారాయణ, పలువురు పంచాయతీ కార్యదర్శులు గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ పాల్గొన్నారు.

కాట్రేనికోన: మండలంలోని ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ వెంకటాచలం అధ్యక్షతన రెండు రోజుల పాటు ఈ తరగతులు నిర్వహించారు.

మద్యం దుకాణాలకు 121 దరఖాస్తులు

తాళ్లరేవు: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని తాళ్లరేవు, కాజులూరు, కరప మండలాల్లో 17 మద్యం దుకాణాలకు గానూ 121 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ కె.కోటేశ్వరరావు తెలిపారు. ఈ నెల 11న ఉదయం కాకినాడ కలెక్టరేట్ సమావేశ మందిరంలో లాటరీ తీస్తారన్నారు.

రేపు జాబ్ మేళా

అమలాపురం రూరల్: అమలాపురం కలెక్టరేట్‌లోని వికాస సంస్థ కార్యాలయంలో బుధవారం జాబ్ మేళా జరుగుతుందని కలెక్టర్ రావిలాల మహేష్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైభవ్ జ్యూయలర్స్‌లో సేల్స్ మేనేజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, క్యాషియర్, ఎలక్ట్రీషియన్, గోల్డ్ అప్రైజర్, డ్రైవర్, ఆఫీస్ బాయ్, మార్కెటింగ్ ఫీల్డ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని అన్నారు.

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విలసవిల్లి దళిత పేటల వాసులు



దుర్గాప్రసాద్ హత్యపై దర్యాప్తు చేయాలని ధర్నా చేస్తున్న నేతలు

అమలాపురం రూరల్: వివిధ సమస్యలు పరిష్కరించాలంటూ అమలాపురం కలెక్టరేట్ వద్ద పలు సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు జరిగాయి. ఉప్పలగుప్తం మండలం విలసవిల్లిలో మూడు దళిత పేటలకు చెందిన శ్మశానానికి వెళ్లడానికి రోడ్డు నిర్మించాలని బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. విలసవిల్లిలో భీమ్‌నగర్, వడ్డివారిపేట, బీరవారిపేటలో 400 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, ఎవరైనా మరణిస్తే శ్మశానానికి తీసుకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాలమూరు మోహన్‌బాబు మాట్లాడుతూ కనీసం శ్మశానవాటికకు వెళ్లడానికి కూడా రోడ్డు నిర్మించకపోవడం దారుణమన్నారు. అనంతరం జేసీ నిషాంతికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కుంచె బాబులు, అంబేడ్కర్, కారెం వెంకటేశ్వరరావు, వెన్నపు దొరబాబు, వస్కా మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హత్య ఘటనపై దర్యాప్తు చేయాలి

అయినవిల్లి మండలానికి చెందిన జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య ఘటనపై దర్యాప్తు చేయాలని అతని భార్య శ్రావణ సంధ్య, కుమారులు సాత్విక్, శాశ్వత్, కుటుంబ సభ్యులు, బంధువులు, దళిత సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. రెండేళ్లుగా కేసులో పురోగతి లేదని, దీనిని ఎస్సీ, ఎస్టీ కేసుగా నమోదు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. వీకేసీ జిల్లా అధ్యక్షుడు బొంతు రమణ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి జేసీకి వినతిపత్రం అందించారు. మాల మహానాడు నాయకుడు గిడ్ల వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి కారెం వెంకటేశ్వరరావు, దళిత నాయకులు ఎడ్ల పండు, గెల్లా రాజేంద్ర, మాగపు ఈశ్వరరావు పాల్గొన్నారు.

పాస్‌బుక్ రాకుండా అడ్డుకుంటున్నారని..

తనకు భర్త నుంచి సంక్రమించిన రెండెకరాల భూమికి అమలాపురం ట్రాన్స్‌కో డీఈఈ కుటుంబ సభ్యులు పట్టాదారు పాస్‌బుక్ రాకుండా అడ్డుకుంటున్నారని కాట్రేనికోన మండలం కందికుప్ప బొజ్జవారిపేటకు చెందిన బొజ్జా విజయ జిల్లా కలెక్టరేట్‌లోని స్పందనలో ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. తన భర్త బొజ్జా భానుమూర్తి మరణించటంతో తనకు సంక్రమించిన సంపూర్ణ హక్కు భుక్తంలో వున్న 2 ఎకరాల భూమిని తమ సరిహద్దులోని వారు దౌర్జన్యంగా వారి పాస్‌బుక్‌లో నమోదు చేయించడం వల్ల తనకు చెందిన భూమికి పాస్‌బుక్ రానివ్వడం లేదని ఆరోపించారు.

ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ బొజ్జా రమణశ్రీ

ముమ్మిడివరం: ప్రతి పౌరుడూ దేశ ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలని ఎంఈఓ బొజ్జా రమణశ్రీ అన్నారు. బెంగుళూరుకు చెందిన ఇండియన్ సోషల్ ఇనిస్టిట్యూట్ వారి సహకారంతో పీపుల్స్ సర్వీస్ బాలికల ఆర్గనైజేషన్, కార్మిలేట్ సిస్టర్ ఆఫ్ థెరిసా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి మూడు రోజులపాటు ప్రజాస్వామ్యం–రాజ్యాంగం అనే అంశంపై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. స్థానిక బాలిక ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి టి.నాగరాజారావు అధ్యక్షత వహించగా రమణశ్రీ ముఖ్య అతిథి గా విచ్చేసి మాట్లాడారు. ఐసీడీఎస్ సీడీపీఓ వి.విమల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగాన్ని గౌరవించాలన్నారు. ఇండియన్ సోషల్ ఇనిస్టిట్యూట్ ఏపీ, తెలంగాణ కో ఆర్డినేటర్ కరుణాకరరావు మాట్లాడుతూ యువతీ యువకులకు భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, సమాచార హక్కు చట్టం అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆక్రమణలతో బక్కచిక్కిన చెరువులు

- ఎమ్మెల్యే కుడుపూడి సూర్యనారాయణరావు
- రాత్రి పూట పారిశుధ్య పనుల విధానం ఎత్తివేత

అమలాపురం టౌన్: పట్టణంలో దాదాపు 31 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఏడు చెరువులు నేడు ఆక్రమణలతో బక్కచిక్కాయని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో సోమవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. శెట్టిబలిజ నేతలు దివంగత మాజీ ఎమ్మెల్యే కుడుపూడి చిట్టబ్బాయి, దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాలు ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్నాయంటూ ముగ్గురు వ్యక్తులు కోర్టుకు వెళ్లడంపై కౌన్సిల్ చర్చించింది. పాలక పక్షం కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, చిట్టూరి పెదబాబు, గోపి రాజీ, బండారు గోవిందు, నాగారపు వెంకటేశ్వరరావు, వాసర్ల లక్ష్మి తదితరులు చిట్టబ్బాయి, వెంకటరెడ్డి విగ్రహాలను తొలగించడం అంటే పట్టణంలో కులాలు, పార్టీల మధ్య చిచ్చుపెట్టే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలో చెరువులు, కాలువలు, డ్రైన్ల గట్లు ఇలా ప్రతీది ఆక్రమణలు గురై పలు నేతల విగ్రహాలను నిర్మించారని కౌన్సిల్ దృష్టికి తీసుకు వచ్చారు. తొలగిస్తే పట్టణంలో ఆక్రమణలలో ఉన్న విగ్రహాలన్నీ తొలగించాలని, కేవలం చిట్టబ్బాయి, వెంకటరెడ్డి విగ్రహాలను తొలగిస్తే కుల, పార్టీల పరంగా వైషమ్యాలు వస్తాయని అన్నారు.

గత బిల్లులు ఇప్పుడు ఆమోదించాలా?

గతంలో పనిచేసిన ఇద్దరు కమిషనర్లు బదిలీలపై వెళుతూ ఒకే రోజు రూ.కోట్లలో పనుల బిల్లులపై సంతకాలు చేయడంపై కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా చర్చించింది. ముందు వెళ్లిన కమిషనర్ ఒకే రోజు రూ.5 కోట్ల బిల్లులపై సంతకాలు చేసి వెళ్లిపోయిన దానిపై ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు ప్రస్తుత కమిషనర్ కేవీఆర్ఆర్ రాజును ప్రశ్నించారు. దీనిపై కౌన్సిలర్ల సూచన మేరకు విచారణ చేయిస్తానని కమిషనర్ అనడంతో ఆ అవకాశం మీకెందుకు ఇస్తాం.. విజిలెన్స్ ద్వారా విచారణ చేయిస్తామని ఎమ్మెల్సీ అన్నారు. గత కౌన్సిల్‌లో చేసిన పనులకు ఇప్పుడు సంతకాల చేసేసి ఆమోదించమంటే ప్రస్తుత కౌన్సిల్ సిద్ధంగా లేదని కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర చెప్పారు. కూటమి ప్రభుత్వం చెత్త పన్ను రద్దు చేసిందని చెబుతున్నా, ప్రజల నుంచి పన్ను వసూళ్లు చేసి స్వచ్ఛంద కార్పొరేషన్‌కు చెల్లించేవారని కౌన్సిలర్ సంసాని బులినాని కౌన్సిల్‌కు వివరించారు. ఇప్పుడు చెత్త పన్ను రద్దు చేసినా ఆ కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన సొమ్మును మున్సిపల్ సాధారణ నిధుల నుంచి చెల్లించాల్సిందేనని గుర్తు చేశారు. చెత్తను తరలించే టిప్పర్లు మున్సిపాలిటీకి ఇచ్చినందుకు ఆ సొమ్ములను కార్పొరేషన్ తిరిగి వసూలు చేస్తుందన్నారు. ఏ రాయితో కొట్టుకున్నా ఒకటేనని స్పష్టం చేశారు.

రాత్రి పూట పారిశుధ్యంపై వ్యతిరేకత

పట్టణంలో రోజూ ఉదయం నిర్వహించే పారిశుధ్య పనులతో పాటు రాత్రి సమయాల్లో వ్యాపార దుకాణాల వద్ద రోజూ పారిశుధ్య పనులు చేయడంపై మొత్తం కౌన్సిలర్ల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావుతో పాటు పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు ఆ విధానాన్ని ఎత్తివేయాల్సిందేనని ఏకమాటగా స్పష్టం చేశారు. రాత్రి పారిశుధ్యం అంటే రాత్రి 10 గంటల తర్వాత చేయాలి. అలా కాకుండా రాత్రి 7 గంటలకే చేయడం వల్ల ట్రాఫిక్‌కు కూడా అంతరాయం కలుగుతోందని కౌన్సిలర్ నాగేంద్ర అన్నారు. చివరికి కమిషనర్ రాజు రాత్రి పారిశుధ్యాన్ని ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారు.



కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి



చెరువుల ఆక్రమణలపై మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

ఒకరు వద్దని.. మరొకరు కావాలని

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కూటమి కౌన్సిలర్లు అయిన టీడీపీ, జనసేన కౌన్సిలర్ల మధ్య ఏకాభిప్రాయం లోపించింది. ఐదో వార్డు కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు (టీడీపీ) అభ్యర్థన మేరకు హౌసింగ్ బోర్డు కాలనీలో ఓ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి, మౌలిక వసతులకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.10 లక్షలు కేటాయించారు. దీనిపై 4వ వార్డు కౌన్సిలర్ పడాల శ్రీదేవి (జనసేన) కమ్యూనిటీ హాలు నిర్మాణానికి సీఎస్ఆర్ నిధులు మంజూరు చేయడం నిబంధనలు ఒప్పుకోవని అభ్యంతరం చెప్పారు.

పాహిమాం పరాశక్తి..



లలితా త్రిపుర సుందరీదేవిగా అమలాపురం శ్రీదేవి అమ్మవారు



యానాంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో శారదాదేవి



ఎస్.యానంలో ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంబికా దుర్గాదేవి



బాలాత్రిపుర సుందరీదేవిగా అమలాపురం వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి

- వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు
- ఘనంగా శరన్నవరాత్ర మహోత్సవాలు

అమలాపురం టౌన్: పరాశక్తి పాహిమాం.. శరణు శరణు దుర్గమ్మ అంటూ ఆ అమ్మవారిని భక్తులు కొలిచారు. దేవీ శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం అమలాపురం పట్టణంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లు వివిధ దేవతామూర్తుల అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. జైన సత్తిరాజు కుటుంబీకులు, అతని స్నేహితుల ఆర్థిక సహకారంతో అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన భారీ అన్న సమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. శ్రీదేవి ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు ఆధ్వర్యంలో అమ్మవారి సన్నిధిలో పలు హోమాలు, కుంకుమ పూజలు జరిగాయి. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు శ్రీబాలా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారి గర్భాలయాన్ని అరటి ఆకులు, కొబ్బరి ఆకులతో అలంకరించారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని వైష్ణవి కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు, హౌసింగ్ బోర్డు కాలనీలోని కల్యాణ దుర్గ ఆలయంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. సావరం బైపాస్ రోడ్డులోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని మహా చండీగా అలంకరించారు. గోల్డ్ మార్కెట్‌లో శ్రీకామాక్షీ ఏకాంబరేశ్వరీదేవి ఆలయంలో పట్టణ విశ్వ బ్రాహ్మణ, స్వర్ణకార సంఘాల ఆధ్వర్యంలో శరన్నవరాత్రఉత్సవాలు జరుగుతున్నాయి.

నేడు రూ.3.33 కోట్లతో అలంకరణ

అమలాపురం వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారిని, ఆలయాన్ని రూ.3.33 కోట్ల కరెన్సీ నోట్లతో మంగళవారం మహాలక్ష్మిదేవిగా అలంకరిస్తామని పట్టణ ఆర్య వైశ్య, వాసవీ మాత ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఇదే సందర్భంలో అయోధ్య శ్రీకోదండ రామునికి సమర్పించబోయే బంగారం, వెండితో తయారు చేసిన ధనస్సును కూడా వాసవీ మాత ఆలయంలో భక్తుల దర్శనార్థం ఉంచుతారని ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణ మూర్తి, ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పన వీరన్న తెలిపారు.

యానాం: స్థానిక శారదాదేవి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బి.శ్రీనివాసరావు దంపతులు ఉత్సవదారులుగా వివిధ పూజలు చేశారు. యానాం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక పడవలరేవు వీధిలో లలితాదేవి అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. రాత్రి ఊంజల్ సేవ నిర్వహించారు.

తాళ్లరేవు: కోరంగిలో దుర్గామల్లేశ్వర శక్తి పంచాయతన అమ్మవారి ఆలయంలో అమ్మవారిని మహాచండీ దేవిగా అలంకరించారు. ఇంజరం హరశ్రీ నిలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. నీలపల్లిలో ఆధ్యాత్మికవేత్త కంచర్ల వెంకట నాగేశ్వరరావు (వెంకన్నబాబు) ఆధ్వర్యంలో వేద పండితులు ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల నేతృత్వంలో ఆయన శిష్య బృందం అమ్మవారిని మహా చండీ పరమేశ్వరీదేవిగా అలంకరించారు.

అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

కాట్రేనికోన: చింతల మెరక గ్రామంలోని నూతన ఆలయంలో శ్రీవిజయ లక్ష్మీదుర్గ విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. విజయ లక్ష్మీదుర్గ నూతన ఆలయ, విగ్రహ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవం మూడు రోజుల నుంచి అత్యంత వైభవంగా జరిగింది. సుదర్శనం వెంకట జనార్దనాచార్యులు ఆధ్వర్యంలో శాంతి హోమాలు చేశారు. ఆలయంలో విగ్రహ, శిఖర ప్రతిష్ఠను కముజు లక్ష్మీ రమణారావు, వనచర్ల సత్యనారాయణ మూర్తి, సంసాని అర్జున, సంసాని దుర్గాప్రసాద్ దంపతులతో చేయించారు. శిఖర ప్రతిష్ఠ అనంతరం శిఖరంపై భక్తులు బూరెలు వేశారు. ఆలయ ప్రతిష్ఠా మహోత్సవానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది.

ఉప్పలగుప్తం: ఎస్.యానంలో కొలువైన ప్రసన్నాంబికా దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులచే ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఇజ్రాయిల్ ఆటవిక దాడులు ఆపాలి

అమలాపురం టౌన్: గాజాపై ఇజ్రాయిల్ ఆటవిక దాడులు, యుద్ధాన్ని ఆపాలని కోరుతూ అమలాపురంలో 11న సీపీఐ, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో సంఘీభావ సదస్సు జరుగుతుందని జిల్లా నాయకులు తెలిపారు. స్థానిక గొల్లగూడెంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో సీపీఐ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు ఈ విషయాన్ని వెల్లడించారు. 11న జరిగే ఈ సంఘీభావ సదస్సుకు ప్రజా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, ప్రజా తంత్రవాదులు పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు.



సంఘీభావ సదస్సు గురించి వివరిస్తున్న జిల్లా సీపీఎం, సీపీఐ నాయకులు

ఎల్ఐసీ ఏజెంట్ల ధర్నా

అమలాపురం టౌన్: ఎల్ఐసీ యాజమాన్యం తీసుకుంటున్న పలు నిర్ణయాలతో ఆ సంస్థ ఏజెంట్లు నష్టపోతున్నందుకు నిరసనగా స్థానిక ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయం ఎదుట ఏజెంట్లు సోమవారం ధర్నా నిర్వహించారు. ఎల్ఐసీ స్థాపించిన 65 ఏళ్లుగా ఉంటున్న ఏజెంట్ల వ్యవస్థకు కమీషన్లు తగ్గించడంతో నడ్డి విరిచినట్లు అయ్యిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్ఐసీ నూతన వ్యాపార విధానాలకు ఏజెంట్లు సహకరించకూడదని నిర్ణయించుకుని, అందుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అక్టోబర్ ఒకటో తేదీ నుంచి అమలవుతున్న నూతన వ్యాపార విధానంలో చిన్న పాలసీలను తీసివేయడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అమలాపురం ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయ ఏజెంట్ల యూనియన్ అధ్యక్షుడు సుందరనీడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో యూనియన్ ప్రతినిధులు ఎస్.శ్యామ్‌బాబు, రావూరి ఉదయ భాస్కర్, దొమ్మేటి శివస్వామి, పెసంగి వెంకటేశ్వర్లు, శీలం లంకేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.



అమలాపురం ఎల్ఐసీ బ్రాంచి కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏజెంట్లు

ఎంపీడీఓను కలసిన సర్పంచులు

అమలాపురం రూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వపరంగా పూర్తి సహకారాలు అందించాలని ఎంపీడీఓ ఉండ్రు బాబ్జీ రాజును పలువురు సర్పంచులు కోరారు. అమలాపురం ఎంపీడీఓగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బాబ్జీ రాజును మండల సర్పంచులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు.